
ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
శనివారం, 29 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 16 | పేజీలు: 4 వెల: 5







## సోనియా ఆత్మకథపై పెంగ్విన్ కీలక ప్రకటన

- 'బిలాంగింగ్' పుస్తకానికి భారత్‌లో మేం ప్రచురణకర్తలం కాదు
- ఎడిటోరియల్ మార్పులపై వచ్చిన వార్తలు అవాస్తవమని వెల్లడి
- నవంబరు 10న పుస్తక విడుదలకు సన్నాహాలు

**కాకతీయ, నేషనల్ డెస్క్** : కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ పుస్తకానికి భారత్‌లో తాము ప్రచురణకర్తలం కాదని పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా స్పష్టం చేసింది. సోనియా గాంధీ ఎడిటోరియల్ మార్పులకు అంగీకరించకపోవడంతో పుస్తక ప్రచురణ నుంచి సంస్థ తప్పుకుందంటూ ఇటీవల వచ్చిన వార్తలను ఖండించింది. పుస్తకాన్ని ప్రచురించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని పేర్కొంది. పుస్తక ప్రచురణ విషయంలో రచయితలతో జరిగే చర్చలు గోప్యమైనవని, వాటి వివరాలను వెల్లడించలేమని సంస్థ తెలిపింది. పుస్తకంలోని సమాచారాన్ని వాస్తవ నిర్ధారణ చేయడం, అవసరమైన సూచనలు చేయడం ప్రచురణ ప్రక్రియలో భాగమని వివరించింది. మరోవైపు భారత్‌లో పుస్తక పంపిణీదారుపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే అమెజాన్‌లో ఈబుక్ వెర్షన్ రూ.2,615కు ప్రీఆర్డర్‌కు అందుబాటులో

........(తరువాయి 2లో)

## 'ఇదేనా భారతీయ రుణ పరిష్కార న్యాయం?'

- సుభాష్ చంద్రకు ఒక న్యాయం.. నాకో న్యాయమా..?
- రూ.6.5 కోట్లకే రుణ పరిష్కారం నిజమే అయితే అభినందనలు
- రూ.6,203 కోట్ల బకాయికి రూ.14,100 కోట్లు రికవరీ చేశారు
- ఎంతోమంది రుణగ్రహీతలు అసలు బకాయిలో కొంత భాగానికే సెటిల్ చేసుకుంటున్నారు : విజయ్ మాల్యా

**కాకతీయ, నేషనల్ డెస్క్** : జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా కేసులో రూ.22,006.57 కోట్ల బకాయిలకు కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే రీపేమెంట్ ప్లాన్‌కు ఎన్‌సీఎల్టీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో వ్యాపారవేత్త విజయ్ మాల్యా స్పందించారు. ఎంతోమంది రుణగ్రహీతలు తక్కువ మొత్తాలు చెల్లించి

........(తరువాయి 2లో)

## రేవంత్ సంకుచితంగా వ్యవహరించొద్దు

- మోదీపై విమర్శలంటే సూర్యుడిపై ఉమ్మివేయడమే
- కేంద్రం రాష్ట్రానికి అడిగిన దానికంటే ఎక్కువ నిధులిస్తోంది
- రేషన్ కార్డులపై సీఎం, మంత్రుల ఫొటోలు ఎందుకు?
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజం



2

- ఆరు గ్యారెంటీల వైఫల్యంపై నియోజకవర్గాల్లో ధర్నాలు
- రైతు సమస్యలపై సదస్సులు..
- మహిళలు, యువతతో ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రజలకు బాకీ ఉన్న హామీలతో ఇంటింటికీ బాకీ కార్డులు
- 420 హామీల మోసాన్ని ఫ్లెక్సీలతో ఎండగట్టాలి
- సెప్టెంబరు 1న తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జిషీట్
- 2వ తేదీ నుంచి వరుసగా నిరసనలు
- సాగునీరు, విద్యుత్తు, యూరియా, బీమా సమస్యలపై రైతులతో చర్చలు
- 22ఏ భూముల సమస్యపైనా పోరాటం
- విద్యార్థులు, యువత సమస్యలపై ర్యాలీలు
- హైదరాబాద్ నగర సమస్యలపై ఆటోలతో భారీ నిరసన
- ప్రజల మధ్యకు వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

# పోరుబాట పట్టండి



### వెయ్యి రోజులైనా హామీలు ప్రభుత్వం నెరవేర్చలే

**కాకతీయ,తెలంగాణ బ్యూరో** : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు దాటినా ప్రధాన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ మోసాన్ని, పాలనా వైఫల్యాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 420 హామీల్లో ఏం అమలు చేశారు.. ఇంకా ఏం బాకీ పెట్టారో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వారం రోజుల ప్రత్యేక కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

**సెప్టెంబరు 1న చార్జిషీట్‌తో శ్రీకారం**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు ముందుగా సెప్టెంబరు 1న తెలంగాణ భవన్‌లో ప్రభుత్వంపై చార్జిషీట్ విడుదల చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. అనంతరం సెప్టెంబరు 2 నుంచి వరుసగా వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇవి కేవలం పార్టీ కార్యక్రమాలుగా కాకుండా ప్రజల సమస్యలకు వేదికగా మారాలని స్పష్టం చేశారు. ప్రతి నాయకుడు తన పరిధిలో ప్రజలతో మమేకమై కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరు, ఇంకా ప్రజలకు బాకీ ఉన్న అంశాలను వివరించాలని చెప్పారు. కార్యక్రమాలపై పార్టీ కేంద్ర కార్యాలయం ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తుందని, నివేదికలు తీసుకుంటుందని తెలిపారు.

**ఆరు గ్యారెంటీలపై ధర్నాలు.. బాకీ కార్డులు**

సెప్టెంబరు 2న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆరు గ్యారెంటీల వైఫల్యంపై ధర్నాలు నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల మోసాన్ని ప్రజలకు గుర్తు చేసేలా భారీ ఫ్లెక్సీల ప్రదర్శన చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు ఇంకా చెల్లించాల్సిన హామీలను స్పష్టంగా తెలియజేసేలా బాకీ

........(తరువాయి 2లో)

## హైదరాబాద్‌ను విషాద నగరంగా మార్చారు

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో మౌలిక వసతులు కుంటుపడ్డాయి
- అధ్వానపు రోడ్లు, అస్తవ్యస్త డ్రైనేజీతో ప్రజలకు ఇబ్బందులు
- మూడు కార్పొరేషన్లలో బీజేపీ గెలిస్తే కేంద్ర పథకాలు మరింత పారదర్శకంగా అందుతాయి:
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

3

## అది 624! తేల్చి చెప్పిన ఏడీ సర్వే

- 527గా ఎలా మారింది?.. మార్చింది ఎవరు?
- పాత నిర్ణయాన్ని పక్కనపెట్టిన డీసీ ప్రసన్నరాణి
- సర్వే నివేదికల మధ్య వైరుధ్యంపై అనుమానాలు
- బాధితులకు 'కోర్టుకు వెళ్లండి'.. డీసీ తీరుపై తీవ్ర విమర్శలు



4



## బంగారం వేటకు వేగం పెంచాలి

### దేవదుర్గ బ్లాక్‌లో ఖనిజ అన్వేషణ పనులు నిరంతరం కొనసాగాలి

- హట్టి గోల్డ్ మైన్స్ సాంకేతిక అనుభవాన్ని దేవదుర్గ ప్రాజెక్టుకు జోడించాలి
- ఆధునిక సాంకేతిక పద్ధతులతో నిక్షేపాల పరిమాణం, నాణ్యత తేల్చాలి
- ఆశాజనక ఫలితాలు వస్తే తదుపరి దశకు ఇప్పటి నుంచే ప్రణాళిక
- హట్టి–సింగరేణి కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలి
- డిప్యూటీ సీఎం , ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క



**కాకతీయ,తెలంగాణ బ్యూరో** : దేవదుర్గ బంగారం-రాగి బ్లాక్‌లో ఖనిజ అన్వేషణ పనులను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి అధికారులను ఆదేశించారు. సింగరేణి వేలం ద్వారా దక్కించుకున్న ఈ బ్లాక్ హట్టి

........(తరువాయి 2లో)

## వరద తగ్గినా.. ముప్పు తప్పలేదా?

- హిమాలయాల్లో మరో జలప్రళయం ముప్పు
- సహజ అడ్డంకులు తెగితే ఒక్కసారిగా భారీ ప్రవాహం
- యాత్రికుల భద్రతపై కైలాస్ సహా పలు మార్గాల్లో ఆందోళన
- ముందస్తు హెచ్చరికలు, లొకేషన్ ట్రాకింగ్‌పై దృష్టి అవసరం



కాకతీయ, నేషనల్ డెస్క్ : వరద నీరు తగ్గిందంటే ప్రమాదం ముగిసినట్టేనా? హిమాలయ ప్రాంతాల్లో మాత్రం సమాధానం 'కాదు' అనే నిపుణుల హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. నేపాల్‌లో భారీ వర్షాలు, ఫ్లాష్‌ఫ్లడ్స్‌తో ఇప్పటికే రోడ్లు, వంతెనలు ధ్వంసమై జనజీవనం అస్తవ్యస్తమైంది. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతుండగానే టిబెట్ వైపు ఆనకట్ట లేదా సహజ నీటి అడ్డంకి తెగిందన్న సమాచారంతో కొన్ని ప్రాంతాల్లో రెస్క్యూ కార్యకలాపాలను సైతం తాత్కాలికంగా నిలిపివేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. హిమాలయాల్లో భారీ వర్షాల తర్వాత కొండచరియలు విరిగిపడి మట్టి, రాళ్లు, మంచు నదీ మార్గాన్ని అడ్డుకునే అవకాశం ఉంటుంది. దీంతో నది ప్రవాహం నిలిచిపోయి సహజ నీటి అడ్డంకి ఏర్పడుతుంది. దాని వెనుక నీటి మట్టం పెరిగినప్పుడు అడ్డంకి బలహీనపడి ఒక్కసారిగా తెగితే భారీ వరద దిగువ ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉంటుంది.

........(తరువాయి 2లో)



## సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన మంత్రి సురేఖ

- ఆడపడుచుల ఆశీస్సులు సీఎంపై ఉండాలి
- తెలంగాణ అభివృద్ధికి మరింత శక్తి, యుక్తి కలగాలి
- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

2

## నీట్ పీజీ 2026.. మరో రెండు రోజుల్లో పరీక్ష

- ఇప్పటికే విడుదలైన అడ్మిట్ కార్డులు
- ఆగస్టు 30న దేశవ్యాప్తంగా పరీక్ష
- 340 నగరాల్లో 1,300కుపైగా కేంద్రాల్లో సీబీటీ విధానం



2

# బంగారం వేటకు వేగం పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

గోల్డ్ మైన్స్‌కు సమీపంలో ఉండటం గొప్ప అవకాశమని, హట్టి సంస్థకు ఉన్న సాంకేతిక అనుభవాన్ని దేవదుర్గ ప్రాజెక్టులో వినియోగించుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులతో అన్వేషణ చేపట్టి ఖనిజ నిక్షేపాల పరిమాణం, నాణ్యతను వీలైనంత త్వరగా నిర్ధారించాలని, ఫలితాలు ఆశాజనకంగా వస్తే తదుపరి దశలో చేపట్టాల్సిన పనులపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూరు జిల్లాలోని హట్టి, యూటీ బంగారు గనులను భట్టి విక్రమార్క సందర్శించారు. బంగారు ఖనిజం వెలికితీత నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు కొనసాగుతున్న ప్రక్రియలను పరిశీలించారు. హట్టి గోల్డ్ మైన్స్‌లోని ఉత్పత్తి కేంద్రం, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే ప్రక్రియను అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున 2 నుంచి 4 కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని తెలిపారు.



**హట్టి అనుభవం దేవదుర్గకు అండగా**

బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో హట్టి గోల్డ్ మైన్స్‌కు అపారమైన అనుభవం ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి సంస్థ అనుభవంతో అనుసంధానం చేయాలని సూచించారు. ముఖ్యంగా దేవదుర్గ బంగారం-రాగి బ్లాక్ హట్టి గోల్డ్ మైన్స్‌కు సమీపంలో ఉండటం వల్ల అక్కడి నిపుణుల అనుభవాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా అన్వేషణ పనులను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లవచ్చన్నారు. భవిష్యత్తులో చేపట్టే బంగారం ప్రాజెక్టుల్లో హట్టి-సింగరేణి జాయింట్ వెంచర్‌గా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ వంటి అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

**నిక్షేపాలపై త్వరగా స్పష్టత**

దేవదుర్గ బంగారం-రాగి బ్లాక్‌లో అసలు ఎంత మేర నిక్షేపాలు ఉన్నాయి, వాటి నాణ్యత ఏ స్థాయిలో ఉంది అనే విషయాలపై స్పష్టమైన అంచనాకు రావాల్సిన అవసరం ఉందని భట్టి చెప్పారు. ఇందుకోసం ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగిస్తూ అన్వేషణను వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్వేషణలో ఆశాజనక ఫలితాలు వెలువడిన వెంటనే తదుపరి దశలో ఏం చేయాలనే అంశంపై ఆలస్యం లేకుండా నిర్ణయాలు తీసుకునేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. దేవదుర్గలో ఏర్పాటు చేయనున్న సింగరేణి సైట్ కార్యాలయాన్ని త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతిని ఆదేశించారు. అన్వేషణ పనులకు అవసరమైన కార్యాలయ, సాంకేతిక, ఇతర మౌలిక ఏర్పాట్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా క్షేత్రస్థాయిలో పనులకు వేగం పెంచాలని సూచించారు.

**యూటీ గనుల్లో క్షేత్రస్థాయి పరిశీలన**

యూటీ ఓపెన్‌కాస్ట్ గోల్డ్ మైన్ వ్యూపాయింట్ వద్ద భట్టి విక్రమార్క బంగారం ముడి మట్టిని వెలికితీసిన ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఓపెన్‌కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి అవసరమైన ముడి సరుకును వెలికితీస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. బంగారు ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను పరిశీలించారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారనే అంశంపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులు ఉప ముఖ్యమంత్రితో మొక్క నాటించారు. అనంతరం యూటీ భూగర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను పరిశీలించారు. భూగర్భంలో ఖనిజం తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. గనుల్లో ఉత్పత్తి ప్రక్రియతోపాటు కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై కూడా వివరాలు తెలుసుకున్నారు. దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలని అన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి-సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపుతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పన, దేశ ఆర్థికాభివృద్ధికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుంద, యెమ్మూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన మంత్రి సురేఖ

- **ఆడపడుచుల ఆశీస్సులు సీఎంపై ఉండాలి**
- **తెలంగాణ అభివృద్ధికి మరింత శక్తి, యుక్తి కలగాలి**
- **అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**కాకతీయ, హైదరాబాద్ :** రాఖీ పండుగ సందర్భంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన ఆమె.. ప్రపంచవ్యాప్తంగా రాఖీ పండుగ జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా మూడోసారి సీఎంకు రాఖీ కట్టినట్లు చెప్పారు. గత మూడేళ్లుగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఆయన మనవడికి కూడా రాఖీ కడుతున్నానని తెలిపారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు సుపరిపాలన అందించేందుకు సీఎంకు మరింత శక్తి, యుక్తి కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ఆడపడుచుల దీవెనలు, ఆశీస్సులు సీఎంపై ఉండాలని కోరారు. అలాగే సీఎం ఆశీర్వాదాలు తెలంగాణ ఆడపడుచులందరిపై ఉండాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.

# మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **మహాలక్ష్మి, ఇందిరా మహిళా శక్తి పథకాలతో అండ**
- **తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ**
- **సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు**



కాకతీయ, హైదరాబాద్: రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. మహిళలకు రక్షణ, గౌరవం కల్పించే సంప్రదాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి ద్వారా స్వయం సహాయక సంఘాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, అమ్మ ఆరోగ్యం ద్వారా ఉచిత ఆరోగ్య పరీక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డలకు అన్నగా సీఎం రేవంత్‌రెడ్డి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు. సీఎం ఆయురారోగ్యాలతో ఉండి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ రాఖీ కట్టడం సంతోషంగా ఉందన్నారు.

# రేవంత్ సంకుచితంగా వ్యవహరించొద్దు

- **మోదీపై విమర్శలంటే సూర్యుడిపై ఉమ్మివేయడమే**
- **కేంద్రం రాష్ట్రానికి అడిగిన దానికంటే ఎక్కువ నిధులిస్తోంది**
- **రేషన్ కార్డులపై సీఎం, మంత్రుల ఫొటోలు ఎందుకు?**
- **బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజం**

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకుచితంగా వ్యవహరించకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ప్రపంచ వేదికలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారతదేశంపై విషం చిమ్ముతున్నారని, రేవంత్‌రెడ్డి కూడా అదే బాటలో నడుస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడానికి కారణం కేంద్రానికి వివక్ష కాదని, భారతదేశ వ్యతిరేక శక్తులను కలిసేందుకు వెళ్తున్నారనే సమాచారమేనని పేర్కొన్నారు. కేంద్రం రాష్ట్రానికి అడిగిన దానికంటే ఎక్కువ నిధులు ఇస్తోందన్నారు. రైల్వే, మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో భేటీ అనంతరం సచివాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో రైల్వే లైన్ల వద్ద ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణానికి కేంద్రం నిధులు ఇస్తుందని చెప్పారు. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్ వరకు 23 గేట్ల వద్ద ఆర్‌యూబీల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా.. ఎన్‌వోసీలు, ట్రాఫిక్ డైవర్షన్, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు సహకరించాల్సి ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో డ్రైనేజీలు, రోడ్లు, లైట్లు వంటి కనీస వసతులను మెరుగుపరచాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎక్కడా వివక్ష చూపడం లేదని ఈటల అన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని రూ.6,300 కోట్లతో పునరుద్ధరించిందని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మించిందని చెప్పారు. చర్లపల్లి, కాచిగూడ, నాంపల్లి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లను ఆధునికీకరించిందన్నారు. రేషన్ కార్డులపై కేంద్రం ఇస్తున్న ఐదు కిలోల బియ్యానికి ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రం ఇస్తున్న కిలో బియ్యానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు పెట్టుకున్నారని విమర్శించారు. ప్రభుత్వం మారితే మళ్లీ కార్డులు ముద్రించి ప్రజాధనాన్ని వృథా చేస్తారా అని నిలదీశారు. ఇంటి నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.75 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.25 లక్షలు కేంద్రం ఇస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకుంటే నిధులు అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. మోదీపై విమర్శలు చేయడమంటే సూర్యుడిపై ఉమ్మివేయడమేనని ఈటల వ్యాఖ్యానించారు. దేశం తర్వాత పార్టీ, వ్యక్తి, అధికారం అనే తమ విధానమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు ప్రోటోకాల్ గౌరవం ఉండాలని, దానిని తగ్గించే ప్రయత్నం చేస్తే వ్యవస్థకే నష్టమని హెచ్చరించారు.

# నీట్ పీజీ 2026.. మరో రెండు రోజుల్లో పరీక్ష

- **ఇప్పటికే విడుదలైన అడ్మిట్ కార్డులు**
- **ఆగస్టు 30న దేశవ్యాప్తంగా పరీక్ష**
- **340 నగరాల్లో 1,300కుపైగా కేంద్రాల్లో సీబీటీ విధానం**



**కాకతీయ, నేషనల్ డెస్క్ :** నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఇప్పటికే అడ్మిట్ కార్డులను విడుదల చేసింది. పరీక్షకు నమోదు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ వివరాలను నమోదు చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆగస్టు 30న దేశవ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. దాదాపు 340 నగరాల్లో 1,300కుపైగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డును పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాలి. హాల్‌టికెట్ లేకుండా కేంద్రంలోకి అనుమతించే అవకాశం ఉండదు. డౌన్‌లోడ్ చేసిన అనంతరం హాల్‌టికెట్‌లో పేరు, ఫొటో, పరీక్ష కేంద్రం, పరీక్ష తేదీ, రిపోర్టింగ్ సమయం తదితర వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ఇతర అవసరమైన పత్రాలను కూడా వెంట తీసుకెళ్లాలి.

**ఇలా డౌన్‌లోడ్ చేసుకోవాలి**

- ఎన్‌బీఈఎంఎస్ అధికారిక వెబ్‌సైట్‌ను తెరవాలి.
- నీట్ పీజీ 2026 అడ్మిట్ కార్డు లింక్‌పై క్లిక్ చేయాలి.
- లాగిన్ వివరాలను నమోదు చేయాలి.
- స్క్రీన్‌పై కనిపించే హాల్‌టికెట్‌ను పరిశీలించాలి.
- అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలి.

పరీక్ష కేంద్రం చిరునామా, రిపోర్టింగ్ సమయాన్ని ముందుగానే తెలుసుకోవడంతో పాటు అక్కడికి చేరుకునే మార్గాన్ని కూడా ముందే పరిశీలించుకోవడం మంచిదని సూచించారు.

# పోరుబాట పట్టండి

(మొదటిపేజీ తరువాయి)

కార్డులను ఇంటింటికీ పంపిణీ చేయాలని ఆదేశించారు. 420 హామీల మోసాన్ని ప్రధాన ప్రచారాంశంగా తీసుకొని ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. సెప్టెంబరు 3న వ్యవసాయ రంగంపై ప్రత్యేకంగా పోరాట కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అన్ని నియోజకవర్గాల్లో రైతు సదస్సులు నిర్వహించి సాగునీరు, విద్యుత్తు, యూరియా, పంటల బీమా తదితర సమస్యలపై రైతులతో చర్చించాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజలకు వివరించాలని సూచించారు. హైదరాబాద్‌తోపాటు పట్టణ ప్రాంతాల్లో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్యపై బాధితులకు అండగా నిలిచి నిరసనలు చేపట్టాలని తెలిపారు. భూముల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాల్సిందేనని డిమాండ్ చేస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

**మహిళల హామీలపై వంటావార్పు**

సెప్టెంబరు 4న మహిళలు, వికలాంగులతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కేటీఆర్ చెప్పారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, తులం బంగారం తదితర హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని తెలిపారు. హామీలు అమలు చేయని ప్రభుత్వానికి నిరసనగా ఆయా ప్రాంతాల్లో వంటావార్పు వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహిళలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా విస్మరించిందో ప్రజలకు వివరించాలని చెప్పారు. సెప్టెంబరు 5న విద్యార్థులు, యువత సమస్యలపై పోరాట కార్యక్రమాలు నిర్వహించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, ఉద్యోగాల కల్పన తదితర అంశాల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని ప్రజలకు వివరించాలని సూచించారు. నియోజకవర్గ కేంద్రాల్లో యువతతో భారీ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. అదిలాబాద్ ప్రాంతంలో సీసీఐ సమస్యలపై, సింగరేణి ప్రాంతాల్లో ఆయా వర్గాల సమస్యలపై ప్రత్యేక నిరసన సదస్సులు చేపట్టాలని ఆదేశించారు.

**నగర సమస్యలపై ఆటోలతో ర్యాలీ**

సెప్టెంబరు 6న హైదరాబాద్‌లో నగర సమస్యలను ఎత్తిచూపుతూ ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. తాగునీరు, వీధిదీపాలు, ట్రాఫిక్, శాంతిభద్రతలు, బస్తీ దవాఖానాల నిర్వహణ వంటి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. ఇతర నియోజకవర్గాల్లో పల్లెల్లో నెలకొన్న సమస్యలు, పారిశుద్ధ్య వ్యవస్థ దెబ్బతినడం, గ్రామీణ ప్రాంతాల ఇబ్బందులపై నిరసనలు చేపట్టాలని సూచించారు. సెప్టెంబరు 7న జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని కాంగ్రెస్ హామీల వైఫల్యాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వేదికగా ఉపయోగించుకోవాలని కేటీఆర్ చెప్పారు. జిల్లా, మండల ప్రజావాణి కేంద్రాల్లో హామీల అమలు వైఫల్యం, ప్రజలకు జరిగిన మోసంపై ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించాలని పార్టీ నాయకులను ఆదేశించారు. ప్రజల నుంచి వస్తున్న సమస్యలను సేకరించి వాటిని ప్రభుత్వానికి తెలియజేయాలని సూచించారు. వారం రోజుల పోరాట కార్యక్రమాల అనంతరం సెప్టెంబరు 8న అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లు నిర్వహించాలని కేటీఆర్ తెలిపారు. ఆయా జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాలు, ప్రజల స్పందన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఈ సమావేశాల ద్వారా వివరించాలని సూచించారు. అదే రోజు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని చెప్పారు. సెప్టెంబరు 10న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేపట్టే నిరసన కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ సంఘీభావం ప్రకటించాలని సూచించారు.

**కేడర్ అంతా ప్రజల్లోనే ఉండాలి**

ఈ వారం రోజుల కార్యాచరణను విజయవంతం చేయడంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమాలను విస్తృతంగా, ప్రజల భాగస్వామ్యంతో, వినూత్నంగా నిర్వహించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలోని వైఫల్యాలు, అమలు కాని హామీలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.



# వరద తగ్గినా.. ముప్పు తప్పలేదా?

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే నేల తడిసి కొండ ప్రాంతాలు బలహీనంగా ఉన్నందున మరో భారీ వర్షం పడితే కొత్త కొండచరియలు, నదీ మార్గాల్లో అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉంది. అందుకే ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వలు, నదీ ప్రవాహాలు, వర్షపాతాన్ని నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

**రెస్క్యూ బృందాలకూ రిస్క్..**

వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు వెళ్లిన సిబ్బందికే ప్రమాదం ఏర్పడితే సహాయక చర్యలు మరింత క్లిష్టంగా మారతాయి. అందుకే ప్రమాద తీవ్రత పెరిగినప్పుడు రెస్క్యూ బృందాలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం తప్పనిసరి. ప్రాణాలను కాపాడే సిబ్బంది కూడా ప్రమాదంలో చిక్కుకోకుండా స్పష్టమైన భద్రతా ప్రోటోకాల్ ఉండాలి. హిమాలయ ప్రాంతాల్లో మరో ప్రధాన సమస్య కమ్యూనికేషన్. వర్షాలు, వరదలతో మొబైల్ నెట్‌వర్క్, విద్యుత్ సరఫరా నిలిచిపోతే సాధారణ ఫోన్ కాల్స్, మెసేజింగ్ సేవలు అందుబాటులో ఉండకపోవచ్చు. ఈ పరిస్థితుల్లో GPS ట్రాకర్లు, శాటిలైట్ కమ్యూనికేషన్, ఎమర్జెన్సీ బీకన్ల వంటి ప్రత్యామ్నాయ వ్యవస్థలు కీలకం. యాత్రికుడి వద్ద ఫోన్ ఉందా లేదా అనేదానికంటే.. అతని చివరి లొకేషన్ అధికారులకు తెలిసే వ్యవస్థ ఉందా అనేదే ముఖ్యమవుతుంది.

**కైలాస్ యాత్రపై ఆందోళన**

నేపాల్ వరదల నేపథ్యంలో కైలాస్ మానస సరోవర్ యాత్రికుల భద్రతపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హిమాలయాల్లో వాతావరణం గంటల వ్యవధిలోనే మారే అవకాశం ఉండటంతో వాతావరణ హెచ్చరిక వచ్చిన వెంటనే యాత్రికులను నిలిపివేయడం, ప్రమాద ప్రాంతాల నుంచి తరలించడం, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయడం వంటి చర్యలు ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులకు సమాచారం అందించే వ్యవస్థ కూడా ముందుగానే సిద్ధంగా ఉండాలి. నేపాల్ ఘటనతో భారత్‌లోని హిమాలయ యాత్రా మార్గాల భద్రతపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. చార్‌ధామ్, అమర్‌నాథ్, హిమాచల్‌ప్రదేశ్, లడఖ్ ప్రాంతాల్లో ఆకస్మిక వర్షాలు, ఫ్లాష్‌ఫ్లడ్స్, కొండచరియలు, రోడ్డు కనెక్టివిటీ దెబ్బతినడం వంటి ముప్పులు ఉన్నాయి. వాతావరణ హెచ్చరిక వచ్చిన వెంటనే యాత్రలను నిలిపివేయడం, ప్రమాద ప్రాంతాల్లో ప్రవేశాన్ని నియంత్రించడం, అత్యవసర షెల్టర్లు ఏర్పాటు చేయడం, యాత్రికుల డిజిటల్ రిజిస్ట్రేషన్, లొకేషన్ ట్రాకింగ్ వంటి వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

# ‘ఇదేనా భారతీయ రుణ పరిష్కార న్యాయం?’



(మొదటిపేజీ తరువాయి)

రుణాలను పరిష్కరించుకుంటున్నారని, తన విషయంలో మాత్రం అన్యాయం జరిగిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ‘సుభాష్ చంద్రకు రీపేమెంట్ ప్లాన్ ఆమోదం పొందిన వార్త నిజమే అయితే నా స్నేహితుడికి హృదయపూర్వక అభినందనలు’ అని మాల్యా పేర్కొన్నారు. తనకు సంబంధించిన రూ.6,203 కోట్ల జడ్జ్‌మెంట్ డెట్‌కు గాను బ్యాంకులు, ప్రభుత్వం తన నుంచి రూ.14,100 కోట్లు రికవరీ చేసినట్లు అంగీకరించాయని తెలిపారు. అయితే ఎంతోమంది రుణగ్రహీతలు అసలు బకాయిలో కొంత భాగానికే సెటిల్ చేసుకున్నారని పేర్కొన్నారు. ‘ఇదే భారతీయ రుణ పరిష్కార న్యాయమని అనుకోవాలా?’ అంటూ ప్రశ్నించారు. ఈ అంశంపై మీడియా నుంచి ఎలాంటి ప్రశ్నలు రావడం లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

**రూ.22,006 కోట్లకు రూ.6.5 కోట్లు**

సుభాష్ చంద్రకు సంబంధించిన కేసులో బ్యాంకులు, రుణ సంస్థలు మొత్తం రూ.22,006.57 కోట్లను క్లెయిమ్ చేశాయి. అయితే రూ.6.5 కోట్లు చెల్లించే రీపేమెంట్ ప్లాన్‌కు ఎన్‌సీఎల్టీ ఆమోదం తెలిపింది. దీంతో రుణదాతలకు దాదాపు 99.97 శాతం నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. 2024 నవంబరులో జరిగిన ఓటింగ్‌లో ఈ ప్లాన్‌కు 80.814 శాతం ఓటింగ్ షేర్ మద్దతు లభించింది. అయితే ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ తదితర సంస్థలు వ్యతిరేకించాయి. ప్లాన్‌ను తిరస్కరించి సుభాష్ చంద్రను దివాలా ప్రక్రియలోకి నెట్టినా రుణదాతలకు మరింత తక్కువ మొత్తమే లభించే అవకాశం ఉందని ఎన్‌సీఎల్టీ పేర్కొంది. ఆయన వ్యక్తిగత ఆస్తుల నుంచి వచ్చే రికవరీ పరిమితంగానే ఉంటుందని ట్రిబ్యునల్ అభిప్రాయపడింది.

# సోనియా ఆత్మకథపై పెంగ్విన్ కీలక ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)




ఉన్నట్లు చూపిస్తోంది. యూకేకు చెందిన విలియం కాలిన్స్ ఈబుక్‌ను ప్రచురించినట్లు సమాచారం.

**రాజీవ్‌తో ప్రేమ నుంచి రాజకీయాల్లోకి..**

తన జీవితంలోని కీలక ఘట్టాలతో పాటు రాజీవ్ గాంధీతో ప్రేమ, వివాహం, రాజకీయాల్లోకి రావడానికి దారితీసిన పరిస్థితులను సోనియా ఈ ఆత్మకథలో ప్రస్తావించినట్లు తెలిపారు. తన జీవితంలో చోటుచేసుకున్న మధురమైన అనుభూతులతో పాటు విషాదాలు, నిరాశల గురించి కూడా ఇందులో రాసినట్లు వెల్లడించారు. ఆరు దశాబ్దాలుగా భారత్‌లో తాను చూసిన సామాజిక, రాజకీయ మార్పులపై తన దృక్పథాన్ని పాఠకులతో పంచుకున్నట్లు చెప్పారు. ఇందిరాగాంధీతో తన పరిచయం, హిందీ నేర్చుకోవడం, చీరలు ధరించడం, భారతీయ వంటకాలను అలవాటు చేసుకోవడం వంటి అనుభవాలతో పాటు గాంధీ కుటుంబాన్ని కుదిపేసిన విషాదాలనూ పుస్తకంలో పొందుపరిచారు. సంజయ్ గాంధీ మరణం, 1984లో ఇందిరాగాంధీ హత్య, అనంతరం రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావడం, ఏడేళ్ల తర్వాత ఆయన హత్యకు గురైన ఘటనలను గుర్తుచేశారు. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి విజయం సాధించినప్పటికీ ప్రధాని పదవిని తాను తిరస్కరించడానికి గల కారణాలను కూడా సోనియా వెల్లడించినట్లు సమాచారం.

# నేరాలపై లోతైన విశ్లేషణతోనే కట్టడి

- మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి
- సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల
- మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు
- సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్ 96 శాతానికి
- నెలవారీ సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తప్పనిసరి
- డీజీపీ సీవీ ఆనంద్



కాకతీయ, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో నేరాల నియంత్రణకు గణాంకాల ఆధారంగా కాకుండా లోతైన విశ్లేషణతో చర్యలు చేపట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, కేసుల పరిష్కారం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. నేరాల ధోరణులను ముందుగానే గుర్తించి.. అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అన్ని పోలీసు యూనిట్ల అధికారులతో నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగింది. 2023–24లో 2,65,377 కేసులు నమోదుకాగా.. 2025–26లో 2,84,363కు చేరాయి. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కు పెరిగింది. మాదకద్రవ్యాల కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగి 46.10 శాతం వృద్ధి చెందాయి. వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కు చేరి 1,704 శాతం పెరిగాయి. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు చేరి 9.48 శాతం వృద్ధి నమోదైంది. మరోవైపు సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు తగ్గాయి. 13.29 శాతం క్షీణత నమోదైంది. ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం తగ్గుదల కనిపించింది. తీవ్ర నేరాలు కూడా గత ఏడాదితో పోలిస్తే 10.33 శాతం తగ్గాయి. 2024–25లో 7,019గా ఉన్న గ్రేవ్ క్రైమ్ కేసులు 2025–26లో 6,294కు తగ్గాయి.

### సాధారణ నేరాలు పెరుగుతున్నాయ్

తీవ్ర నేరాలు తగ్గినప్పటికీ సాధారణ నేరాలు మాత్రం పెరుగుతున్నాయి. 2023–24లో 2,59,201గా ఉన్న నాన్–గ్రేవ్ కేసులు 2025–26లో 2,78,069కు చేరాయి. మూడేళ్లలో 7.28 శాతం పెరుగుదల నమోదైంది. కమిషనరేట్లలో ఫ్యూచర్ సిటీలో 23.70 శాతం, సైబరాబాద్‌లో 17.32 శాతం, మల్కాజిగిరిలో 13.53 శాతం పెరిగాయి. హైదరాబాద్‌లో మాత్రం 2.77 శాతం తగ్గాయి. జిల్లాల విషయానికి వస్తే కొమురం భీం ఆసిఫాబాద్‌లో 70.88 శాతం, ఆదిలాబాద్‌లో 60.71 శాతం పెరుగుదల నమోదైంది. మాదకద్రవ్యాల కేసుల పెరుగుదలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని డీజీపీ సూచించారు. సైబరాబాద్‌లో నార్కోటిక్ కేసులు 266 నుంచి 508కు, వరంగల్‌లోనూ గణనీయంగా పెరిగాయి. ఆదిలాబాద్‌లో 57 నుంచి 219కు, నిజామాబాద్‌లో 62 నుంచి 123కు చేరాయి. నారాయణపేట, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనూ పెరుగుదల నమోదైంది.

### మహిళలు, చిన్నారులపై నేరాల్లో స్వల్ప తగ్గుదల

మహిళలు, చిన్నారులపై నమోదైన నేరాలు 2024–25లో 31,593 నుంచి 2025–26లో 31,108కు తగ్గాయి. ఏడాదిలో 1.54 శాతం క్షీణత నమోదైంది. అయితే 2023–24తో పోలిస్తే 3.81 శాతం ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్, సైబరాబాద్, వరంగల్ కమిషనరేట్లలో కేసులు తగ్గగా.. ఫ్యూచర్ సిటీలో 790 నుంచి 994కు పెరిగాయి. నేర నియంత్రణలో సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. ఏఐ ఆధారిత పోలీసింగ్ అప్లికేషన్లు, సీసీటీఎన్ఎస్, టీజీ–కాప్, హాక్ఐ తదితర డిజిటల్ వేదికల పనితీరు, వినియోగంపై సమావేశంలో సమీక్షించారు. సీసీటీఎన్ఎస్ డేటా నవీకరణ గతంలో 70–80 శాతం ఉండగా.. ప్రస్తుతం 96 శాతానికి చేరడంపై అధికారులను అభినందించారు. నిర్ణీత గడువులోగా డిజిటల్ పోలీసింగ్ పోర్టళ్లలో సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. కొత్త నేర చట్టాల అమలు, ఇంటర్‌ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, సైబర్ నేరాల నియంత్రణ, ఈగల్ కార్యకలాపాలు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ పనితీరు, కేసుల భారంపైనా సమీక్షించారు. యువ ఐపీఎస్ అధికారులు చేపట్టిన సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను సమావేశంలో వివరించారు.

### నెలవారీ సమీక్షలు తప్పనిసరి

ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ ఆదేశించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని సూచించారు. జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల్లో గుర్తించిన అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిశితంగా పర్యవేక్షించాలని చెప్పారు. ప్రాథమిక పోలీసింగ్ విధానాలను కచ్చితంగా అమలు చేయడంతోపాటు వృత్తిపరమైన ప్రమాణాలను పాటించాలని డీజీపీ స్పష్టం చేశారు. డేటా విశ్లేషణ, సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర పర్యవేక్షణతోనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. యూనిట్ స్థాయిలో జవాబుదారీతనం, సకాలంలో నిర్ణయాలు, లక్ష్యిత చర్యలతో నేర నియంత్రణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా తదితరులు హాజరయ్యారు.

## మాలల 'చలో సెక్రటేరియట్'ను విజయవంతం చేయాలి

- మాలల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా తరలిరావాలి
- ఆగస్టు 31న హైదరాబాద్‌లో కార్యక్రమం
- చలో సెక్రటేరియట్‌కు పెద్దసంఖ్యలో తరలిరావాలి : మేడి అంజయ్య



కాకతీయ, శంకరపట్నం: మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు ఆగస్టు 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'మాలల చలో సెక్రటేరియట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపుమేరకు శంకరపట్నం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడే శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాలలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన విద్య, ఉద్యోగ అవకాశాలు పూర్తిస్థాయిలో అందడం లేదని, 5 శాతం రిజర్వేషన్ అమలులోనూ అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 99లో రోస్టర్ పాయింట్ల కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. 20 రోస్టర్ పాయింట్లలో మాలలకు రెండు పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాలల విద్యా, ఉద్యోగ హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించే చలో సెక్రటేరియట్‌కు విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మేధావులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు దామెర సత్యం, మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లింగం కుమార్, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్లలో బీఆర్ఎస్ విధ్వంసం

- ఇప్పుడు కాంగ్రెస్ నిలువునా ముంచుతోంది
- సింగరేణి నుంచి రూ.55 వేల కోట్ల బకాయిలు వాడుకుంటారా?
- కార్మికుల శ్రమ తెలియాలంటే గనిలోకి దిగి బొగ్గు మోయాలి
- బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్

కాకతీయ,తెలంగాణ బ్యూరో : తెలంగాణ ప్రజల జీవనాడిగా, లక్షలాది కార్మిక కుటుంబాలకు ఆధారంగా ఉన్న సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా దివాలా తీయిస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణిని దోపిడీకి అడ్డాగా మార్చారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధంగా సంస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సింగరేణి నుంచి గత ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లు దారిమళ్లించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ బకాయిలు రూ.55 వేల కోట్లకు చేరాయని ఆరోపించారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భూగర్భంలో బొగ్గు వెలికితీస్తున్న కార్మికుల శ్రమతోనే సింగరేణి నిలబడిందని కుమార్ అన్నారు. కార్మికుల కష్టార్జితాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడం సరికాదన్నారు. సంస్థను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టి.. చివరకు కార్మికులకు జీతాలు చెల్లించేందుకు సైతం అప్పులు, వడ్డీలు తెచ్చే పరిస్థితి కల్పించారని విమర్శించారు. కార్మికుల కష్టం తెలియాలంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గనిలోకి దిగి రెండు తట్టల బొగ్గు ఎత్తుకుని నడిచి పైకి రావాలని సవాల్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల అసమర్థ విధానాలతో సింగరేణి భారీ నష్టాల్లో కూరుకుపోయి బీఐఎఫ్ఆర్ పరిధిలోకి వెళ్లిందని కుమార్ పేర్కొన్నారు. నాటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి చొరవతో మారటోరియం, ఆర్థిక ప్యాకేజీ లభించి సంస్థకు పునర్జీవం వచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికులు కీలక పాత్ర పోషించారని కుమార్ తెలిపారు. ఓపెన్‌కాస్ట్ గనులను రద్దు చేస్తామని, ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చిన అప్పటి కేసీఆర్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక సింగరేణిని దోచుకోవడంతో పాటు గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో శిలాఫలకాలు వేసినా ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తిచేయలేకపోయిందని విమర్శించారు.

### కేంద్రం అండగా ఉంది

సింగరేణికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని కుమార్ అన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి చొరవతో సంస్థకు సుమారు రూ.1.95 లక్షల కోట్ల ఆదాయం, వ్యాపార అవకాశాలు లభించాయని తెలిపారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌కు సంబంధించిన అటవీ, పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడంలో కేంద్రం చొరవ చూపిందన్నారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే దక్కేలా చర్యలు తీసుకున్నారని, మణుగూరు పీకేఓసీ–2 ఓపెన్‌కాస్ట్‌కు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించిన కోయగూడెం బ్లాక్–3ను తిరిగి సింగరేణికి అప్పగించేలా కిషన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని కుమార్ తెలిపారు. సింగరేణిని కాపాడేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారని అన్నారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి సింగరేణిని నిర్వీర్యం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని కుమార్ హెచ్చరించారు.

## గవర్నర్‌ను పరామర్శించిన భట్టి, శ్రీధర్‌బాబు





కాకతీయ, హైదరాబాద్ : గుండె సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జి అయి లోక్‌భవన్‌కు చేరుకున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గవర్నర్ త్వరగా సంపూర్ణఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఎర్రబెల్లికి రాఖీ కట్టిన సోదరిమణులు

- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా వేడుక
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుభాకాంక్షలు



కాకతీయ, హైదరాబాద్: అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఆయన సోదరీమణులు బియ్యాల నళినీదేవి, తక్కెళ్లపల్లి వారిజ రాఖీ కట్టి ఆశీర్వాదాలు అందించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం ఈ కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలు, ఆత్మీయత ఎల్లప్పుడూ ఇలాగే చిరస్థాయిగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## జేఎన్‌టీయూలో ర్యాగింగ్ కలకలం?

- తెల్లవారుజామున 2 గంటలకు హాస్టల్ వద్దకు థర్డ్ ఇయర్ విద్యార్థులు
- తలుపులు తీయని సెకండ్ ఇయర్ విద్యార్థులు.. ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు
- ఘటనపై కమిటీ విచారణ.. నివేదిక ఆధారంగా చర్యలు

కాకతీయ, హైదరాబాద్: కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూలో ర్యాగింగ్ ఆరోపణలు కలకలం రేపాయి. తెల్లవారుజామున 2 గంటల సమయంలో థర్డ్ ఇయర్ విద్యార్థులు సెకండ్ ఇయర్ విద్యార్థులు ఉంటున్న గౌతమి హాస్టల్ వద్దకు వచ్చినట్లు సమాచారం. తలుపులు ఎంత కొట్టినా సెకండ్ ఇయర్ విద్యార్థులు తీయలేదని తెలుస్తోంది. థర్డ్ ఇయర్ విద్యార్థుల తీరుపై ఆందోళన వ్యక్తం చేసిన సెకండ్ ఇయర్ విద్యార్థులు శుక్రవారం కళాశాల ప్రారంభం కాగానే ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. థర్డ్ ఇయర్ విద్యార్థులు మంజీర హాస్టల్‌లో, సెకండ్ ఇయర్ విద్యార్థులు గౌతమి హాస్టల్‌లో ఉంటున్నట్లు సమాచారం. తెల్లవారుజామున అసలు ఏం జరిగిందనే అంశంపై జేఎన్‌టీయూ యాజమాన్యం ఆరా తీస్తోంది. విద్యార్థుల ఫిర్యాదుపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రిన్సిపల్ కమిటీని ఏర్పాటు చేశారు. ర్యాగింగ్ జరిగిందా? లేక ఇతర కారణాలతో థర్డ్ ఇయర్ విద్యార్థులు హాస్టల్‌కు వచ్చారా? అనే కోణాల్లో కమిటీ విచారణ చేపట్టింది. ర్యాగింగ్ ఏ రూపంలోనూ నిషేధమని జేఎన్‌టీయూ అధికారికంగా పేర్కొంది. కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.వర్సిటీలో హాస్టళ్ల నిర్వహణ సంబంధిత ప్రిన్సిపల్/డైరెక్టర్ నియంత్రణలో ఉంటుందని వర్సిటీ వెల్లడించింది.

## కేసీఆర్‌కు మహిళా నేతల రాఖీ

రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన గొంగిడి సునీత, తుల ఉమ



కాకతీయ, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు పార్టీ మహిళా నేతలు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ వారిద్దరినీ ఆత్మీ యంగా పలకరించి ఆశీర్వదించారు. వారికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాఖీలు కట్టిన గొంగిడి సునీత, తుల ఉమలను కేసీఆర్ దంపతులు చీర, సారెతో సత్కరించి ఆశీర్వదించారు.


## హైదరాబాద్‌ను విషాద నగరంగా మార్చారు

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో మౌలిక వసతులు కుంటుపడ్డాయి
- అధ్వానపు రోడ్లు, అస్తవ్యస్త డ్రైనేజీతో ప్రజలకు ఇబ్బందులు
- మూడు కార్పొరేషన్లలో బీజేపీ గెలిస్తే కేంద్ర పథకాలు మరింత పారదర్శకంగా అందుతాయి:
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై విద్యావంతులు, మేధావులు, సామాన్య ప్రజలు పెద్దఎత్తున బీజేపీ వైపు చూస్తున్నారని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. తార్నాక డివిజన్‌లో మాదాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో పలువురు విద్యావంతులు, స్థానిక ప్రముఖులు బీజేపీలో చేరారు. వారికి రాంచందర్‌రావు కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను 'విశ్వనగరం' చేస్తామని గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు గొప్పలు చెప్పి మహానగరాన్ని 'విషాద నగరం'గా మార్చాయని విమర్శించారు. జీహెచ్ఎంసీ పరిధిలో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధ్వానపు రోడ్లు, అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థతో నగర ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గత, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతో భాగ్యనగర అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని నగర ప్రజలు విశ్వసిస్తున్నారని రాంచందర్‌రావు అన్నారు. రాబోయే మూడు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. మూడు కార్పొరేషన్లలో బీజేపీ విజయం సాధిస్తే మోదీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు మరింత పారదర్శకంగా ప్రజలకు చేరుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాదాల రాధాకృష్ణతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జానీమియా కుటుంబాన్ని పరామర్శించిన

## రైతు కమిషన్ సభ్యులు



కాకతీయ, కారేపల్లి/కామేపల్లి : మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన ఎస్.కే. జానీమియా అకాల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకుడు రామ్‌రెడ్డి శ్రీచరణ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. జానీమియా మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ముచ్చర్ల గ్రామ అధ్యక్షుడు శ్రీను, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గింజల నర్సిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, కామేపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ వేణు, మార్కెట్ డైరెక్టర్ మాలోత్ బావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లపై కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి కొరడా

- ఆకస్మిక తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనల గుర్తింపు
- నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వో అప్పయ్యకు ఆదేశాలు
- పార్కింగ్ స్థలాలను ఇతర అవసరాలకు వినియోగించడంపై కలెక్టర్ ఆగ్రహం
- పీసీపీఎన్‌డీటీ, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ నిబంధనలు పాటించాలి :కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి





కాకతీయ, వరంగల్ బ్యూరో : హన్మకొండ నగరంలోని స్కానింగ్, డయాగ్నస్టిక్ సెంటర్లపై జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కొరడా ఝుళిపించారు. నిబంధనల అమలు తీరును పరిశీలించేందుకు శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాకాజీ కాలనీలోని మెప్సన్ డయాగ్నస్టిక్ సెంటర్, న్యూ విజన్ డయాగ్నస్టిక్ సెంటర్లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా భవన ప్రణాళికలో పార్కింగ్‌కు కేటాయించిన స్థలాలను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో సంబంధిత సెంటర్లకు నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. అప్పయ్యను ఆదేశించారు. మెప్సన్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ గదులను కలెక్టర్ పరిశీలించారు. అక్కడ నిర్వహిస్తున్న వివిధ రకాల స్కానింగ్ పరీక్షలు, వాటి వివరాలను కేంద్రం ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు సంబంధించిన ధరల పట్టికను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా నిబంధనల ప్రకారం ప్రదర్శించాలని ఆదేశించారు. అనంతరం న్యూ విజన్ డయాగ్నస్టిక్ సెంటర్‌కు వెళ్లగా తాళం వేసి ఉండటంతో.. దాని అండర్‌గ్రౌండ్ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు.

### పార్కింగ్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

రెండు డయాగ్నస్టిక్ సెంటర్లు పార్కింగ్‌కు కేటాయించిన ప్రదేశాలను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కింగ్‌కు అనుమతించిన స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర అవసరాలకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. స్కానింగ్ పరీక్షల ధరల పట్టికతో పాటు సేవలందిస్తున్న వైద్యుల వివరాలను కూడా ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతి క్లినిక్, ఆసుపత్రి, డయాగ్నస్టిక్ సెంటర్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను అమలు చేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య పలు ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. కాకతీయ కిడ్నీ సెంటర్, సిద్ధార్థ కార్డియాక్ సెంటర్, వినోద డెంటల్, మల్లిక చిల్డ్రన్స్ హాస్పిటల్‌లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ స్థలాలను మెడికల్ షాపులు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో వైద్య సిబ్బంది సందీప్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక దివ్యాంగ చిన్నారులతో
## కడియం కావ్య, శ్రీహరి రాఖీ వేడుకలు

ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆప్యాయంగా రాఖీలు కట్టిన చిన్నారులు



కాకతీయ, హన్మకొండ: మల్లికాంబ మనోవికాస కేంద్రం మానసిక దివ్యాంగ చిన్నారులతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం రాఖీ పండుగ వేడుకలు జరుపుకున్నారు. హన్మకొండ కనకదుర్గ కాలనీలోని కడియం శ్రీహరి నివాసంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు ఎంపీ, ఎమ్మెల్యేలకు రాఖీలు కట్టారు. అనంతరం వారు చిన్నారులకు స్వయంగా మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలను ప్రత్యేక ఆదరణ అవసరమైన దివ్యాంగ పిల్లలతో కలిసి జరుపుకోవడంలోనే నిజమైన ఆనందం ఉందన్నారు. ప్రేమాభిమానాలు, ప్రోత్సాహం అందిస్తే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. చిన్నారులను ఆప్యాయంగా చూసుకుంటున్న మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు, ఉపాధ్యాయులను అభినందించారు. కేంద్రం అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఎక్సైజ్ స్వాధీనం వాహనాల వేలం

31న ములుగు ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం

కాకతీయ, ములుగు : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ములుగు పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 31న వేలం వేయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ములుగు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉదయం 10.30 గంటలకు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి, భూపాలపల్లి జిల్లా సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు అప్‌సెట్ ధరలో 50 శాతాన్ని ధరావత్తుగా చెల్లించాలి. వాహనం పొందిన వారు అదే రోజు మిగిలిన మొత్తాన్ని చెల్లించి తీసుకెళ్లాలని సూచించారు. స్క్రాప్ వాహనాలను కట్ చేసి మాత్రమే తరలించాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో వాహనం పొందిన వారు నిబంధనల మేరకు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ములుగు పేర్కొన్నారు.

## బాలికల విద్యే దేశ సాధికారతకు పునాది

- 'బాలికను చదివిద్దాం-దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం'
- బాలసదనం బాలికలతో రాఖీ వేడుకలు
- జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు



కాకతీయ, ములుగు: రక్షాబంధన్ సందర్భంగా బాలసదనం బాలికలు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుకు, అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి రాఖీలు కట్టారు. శుక్రవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. 'బాలికను చదివిద్దాం–దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం' అనే సందేశంతో రూపొందించిన రాఖీలను కలెక్టర్‌కు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బాలికలను ఆప్యాయంగా పలకరించిన కలెక్టర్ ఆశీర్వదించి మిఠాయిలు పంపిణీ చేశారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, భద్రత, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. బాలికలను చదివించడం ద్వారా కుటుంబం, సమాజం, దేశ పురోగతికి బాటలు వేయవచ్చని జిల్లా సంక్షేమ అధికారి ఇ.పి. ప్రేమలత తెలిపారు. కార్యక్రమంలో నరేష్, అరుణ, రాణి, లావణ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రకాళీ అమ్మవారి పవిత్రోత్సవాలు ముగింపు

- మహాపూర్ణాహుతి అనంతరం అమ్మవారికి పవిత్రధారణం
- వేలాది మంది భక్తులకు శాస్త్రోక్తంగా రక్షాబంధనం
- శాస్త్ర పద్ధతిలో ఉత్సవాల నిర్వహణ : ఈఓ రామల సునీత



కాకతీయ, వరంగల్ : వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. పవిత్రోత్సవ క్రతు మహాపూర్ణాహుతి అనంతరం అమ్మవారికి పవిత్రధారణం నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. పవిత్రాలతో అలంకరించిన అమ్మవారిని వందలాది మంది భక్తులు దర్శించుకుని తన్మయత్వంతో పులకించిపోయారు. 'భద్రకాళీ శరణం మమ' నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సంవత్సరమంతా అమ్మవారికి నిర్వహించే పూజల్లో అర్చకులు, భక్తులు, అధికారుల వల్ల తెలిసీ తెలియక జరిగిన లోటుపాట్లు, అపచారాల వల్ల సంక్రమించిన దోషాలు తొలగిపోయి శుద్ధి కలగడంతోపాటు వార్షిక ఆరాధనల సంపూర్ణ ఫలప్రాప్తి, లోకకళ్యాణం కోసం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారని కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు. వైదికాగమ శాస్త్రానుసారం ఆలయంలో పూజలు, క్రతువులు, ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ సందర్భంగా వేలాది మంది భక్తులకు పురోహితులు శాస్త్రోక్తంగా రక్షాబంధనం నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి రోజున పురోహితుడి చేత రక్షాబంధనం చేయాలని భవిష్య పురాణంలో ఉన్నట్లు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. శుక్రవారం కావడంతో ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

# అది 624! తేల్చిచెప్పిన ఏడీ సర్వే





- 527గా ఎలా మారింది?.. మార్చింది ఎవరు?
- పాత నిర్ణయాన్ని పక్కనపెట్టిన డీసీ ప్రసన్నరాణి
- సర్వే నివేదికల మధ్య వైరుధ్యంపై అనుమానాలు
- బాధితులకు 'కోర్టుకు వెళ్లండి'.. డీసీ తీరుపై తీవ్ర విమర్శలు

కాకతీయ, వరంగల్ ప్రతినిధి: ఒకే స్థలానికి సంబంధించిన సర్వే నంబర్ విషయంలో జీడబ్ల్యూఎంసీ అధికారుల నిర్ణయాలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి. 624/1/2 సర్వే నంబర్ సరైనదని గతంలో పరిశీలించిన అధికారులు తేల్చగా.. ఇటీవల అదే స్థలాన్ని 527/బిగా పేర్కొంటూ చర్యలు తీసుకోవడంపై బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ నెల 14న ఏడీ సర్వే ఇచ్చిన నివేదికలోనూ స్థలం 624/1/2కు సంబంధించినదిగా తేల్చినట్లు వారు చెబుతున్నారు. మరి 527/బి సర్వే నంబర్ ఎలా తెరపైకి వచ్చింది? దాన్ని మార్చింది ఎవరు? ఏ రికార్డుల ఆధారంగా నిర్ణయం తీసుకున్నారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రధానంగా మారాయి.

### 2021లోనే 527/బి తప్పుడు నంబర్‌గా గుర్తింపు?

ఇదే వివాదం 2021లోనూ తలెత్తినట్లు బాధితులు చెబుతున్నారు. అప్పట్లో జీడబ్ల్యూఎంసీలో డీసీగా పనిచేసిన జోనా ఇరువర్గాల పత్రాలను పరిశీలించి 624/1/2 సరైన సర్వే నంబర్‌గా, 527/బిని తప్పుగా గుర్తించినట్లు వారు పేర్కొంటున్నారు. 527/బి ఆధారంగా జారీ చేసిన ఇంటి నంబర్‌ను కూడా అప్పుడే రద్దు చేసినట్లు చెబుతున్నారు. అయితే తాజాగా అదే వ్యవహారం మళ్లీ తెరపైకి రావడం వెనుక కారణమేంటన్నది ప్రశ్నగా మారింది. పాత విచారణలో పరిశీలించిన పత్రాలు, అప్పటి నిర్ణయం, ఇంటి నంబర్ రద్దు ఉత్తర్వులు, తాజాగా తీసుకున్న నిర్ణయానికి ఆధారమైన రికార్డులను బయటపెడితే వాస్తవం తేలుతుందని బాధితులు అంటున్నారు.

### 624ను 527గా మార్చింది ఎవరు?

ఒకవైపు ఏడీ సర్వే నివేదిక 624/1/2ను సూచిస్తుండగా.. మరోవైపు డీసీ ప్రసన్నరాణి పేరుతో జారీ అయిన నోటీసుల్లో 527/బి ఆధారంగా హక్కులు నిర్ణయించడంపై బాధితులు ప్రశ్నిస్తున్నారు. సర్వే నంబర్ మార్పునకు సంబంధించిన రికార్డు ఏది? మార్పు ఎప్పుడు జరిగింది? ఎవరి ఆదేశాలతో జరిగింది? సంబంధిత ఫైల్‌లో ఎవరి సంతకాలు ఉన్నాయి? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు. ముఖ్యంగా సర్వే రికార్డులు, పాత ఇంటి నంబర్ల ఫైళ్లు, మ్యూటేషన్ పత్రాలు, నిర్మాణ అనుమతులు, ఏడీ సర్వే నివేదికలను పరస్పరం సరిపోల్చాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

### అధికారానికి హద్దులు ఉండవా?

తమ వద్ద ఉన్న పత్రాలు, సర్వే నివేదికలు సమర్పించినప్పటికీ సమస్యను పరిష్కరించకుండా కోర్టుకు వెళ్లాలని సూచించడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ రెండు వర్గాల మధ్య హక్కు వివాదం ఉంటే.. బల్దియా రికార్డుల్లో సర్వే నంబర్లు, ఇంటి నంబర్లకు సంబంధించిన నిర్ణయాలు ఏ ఆధారంగా తీసుకున్నారో ముందుగా స్పష్టం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అంటున్నారు. ఇప్పటికే ఒకసారి 624/1/2 సరైనదని తేల్చిన నేపథ్యంలో మళ్లీ అదే స్థలాన్ని 527/బిగా పేర్కొనడంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### 'కబ్జాలకు అండ' ఆరోపణలపై విచారణ ఏదీ?

డీసీ ప్రసన్నరాణి తీరుపై బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. నగరంలో అక్రమ ఆక్రమణలకు అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు తరచూ వస్తున్న నేపథ్యంలో.. ఈ వ్యవహారంలోనూ అదే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెబుతున్నారు. అయితే అవినీతి లేదా కబ్జాలకు అధికారుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు రికార్డుల ఆధారం గా నిర్ధారించాల్సి ఉంది. 624/1/2, 527/బి సర్వే నంబర్లకు సంబంధించిన పూర్తి రికార్డులను స్వతంత్రంగా పరిశీలించి.. తప్పు ఎక్కడ జరిగిందో తేల్చాలని వారు కోరుతున్నారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటుబాధితులకున్యాయంచేయాలనిడిమాండ్ చేస్తున్నారు.

## మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్
- కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన వార్డు ఆడపడుచులు



కాకతీయ, పరకాల: రక్షాబంధన్ సందర్భంగా పరకాల పట్టణ 19వ వార్డులో అక్కాచెల్లెళ్లు, ఆడపడుచులు స్థానిక కౌన్సిలర్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి రాఖీ బంధన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఇలాంటి బంధాలను గుర్తుచేసుకోవడం గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం లో మహిళలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మహిళలకు ప్రాధాన్యమిస్తూ రక్షాబంధన్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రోత్సహిస్తున్నారని కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో వార్డు ఆడపడుచులు పాల్గొన్నారు.

## ఇనగాల వెంకట్రామ్‌రెడ్డికి
## రాఖీ కట్టిన చిన్నారులు



కాకతీయ, హనుమకొండ: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని బాలసముద్రంలోని మల్లికాంబ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ అండ్ డిసేబిలిటీస్ ఆశ్రమానికి చెందిన చిన్నారులు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆయనకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. వెంకట్రామ్‌రెడ్డి చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారితో కొంతసేపు గడిపారు. అనంతరం మిఠాయిలు తినిపించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలసదన్ బాలికలతో కలెక్టర్ రక్షాబంధన్

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి రాఖీలు కట్టిన బాలికలు
- అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్
- బాలసదన్ బాలికలకు రక్షణగా నిలుస్తాం : కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



కాకతీయ, హనుమకొండ: హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి చాంబర్‌లో సుబేదారిలోని బాలసదన్ బాలికలు ఆమెకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలికలకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. బాలసదన్ బాలికలకు ఎల్లప్పుడూ రక్షణగా నిలవాలని ఆకాంక్షించారు. కలెక్టర్‌తో కలిసి రక్షాబంధన్ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని బాలికలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, బాలసదన్ సూపరింటెండెంట్ కళ్యాణి, బాలసదన్ బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వినయ్‌భాస్కర్‌కు
## సోదరీమణుల రాఖీ

- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ ప్రతీక : దాస్యం వినయ్‌భాస్కర్



కాకతీయ, హనుమకొండ: రాఖీ పండుగ సందర్భంగా ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్‌భాస్కర్‌కు ఆయన సోదరీమణులు ఆత్మీయంగా రాఖీలు కట్టారు.సాంప్రదాయ పద్ధతిలో మంగళహారతులు ఇచ్చి ఆశీర్వదించారు. కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో రాఖీ పండుగను జరుపుకున్నారు. సోదరీమణులు చూపిన ప్రేమాభిమానాలకు దాస్యం వినయ్‌భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధం, ఆత్మీయతకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి కుటుంబంలో సంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

# సెప్టెంబరు 15లోగా
## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- 4,562 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు.. 851 పూర్తి
- గుడిసెల సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



కాకతీయ, భూపాలపల్లి: జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు గుడిసెల సర్వేను పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో గృహ నిర్మాణ, డీఆర్‌డీఓ, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాకు 4,562 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 851 పూర్తయ్యాయని తెలిపారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేసి సెప్టెంబరు 15లోగా లక్ష్యాలు సాధించాలని సూచించారు. భూపాలపల్లి మండలంలో అదనంగా 200 ఇళ్లు, నియోజకవర్గంలో మొత్తం 1,100 ఇళ్లు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. నిర్మాణాలు ప్రారంభం కాని ఇళ్లపై కారణాలను గుర్తించి లబ్ధిదారులతో మాట్లాడాలని ఆదేశించారు. అర్హులైన పేద కుటుంబాలెవరూ మిగలకుండా గుడిసెల సర్వే పూర్తి చేయాలన్నారు. భాస్కర్‌గడ్డ 2బీహెచ్‌కే లేఅవుట్‌లో సీవరేజ్, విద్యుత్, తాగునీటి పనులు వేగవంతం చేయాలని సూచించారు.